సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 20 । జూలై । 2023



ప్రశాంత వాతావరణంతోనే గ్రామాల అభివృద్ధి
ప్రశాంత వాతావరణంతో అభివృద్ధి సాధ్యమని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. 8లో



నిరంతరం అప్రమత్తత
ఏవోబీ సరిహద్దులో పోలీసు బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరాపుట్టు డీఐజీ చరణ్ సింగ్ మీనా ఆదేశించారు. 8లో



'పవన్ డైలాగులు పనిచేయవు'
పవన్ కల్యాణ్ సినిమా డైలాగులు రాజకీయాల్లో పనిచేయవని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. 8లో

యంత్రాంగం అప్రమత్తం

పొంగిన గోదావరి.. శబరి

గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు క్రమేపీ పెరుగుతుండటంతో విలీన మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితిని గమనించిన జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసింది. అవసరమైతే పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సర్వం సిద్ధం చేసింది. గతేడాది వరద సంభవించిన సందర్భంలో అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తగు చర్యలు చేపట్టారు.

- పెరుగుతున్న నీటిమట్టాలు
- రంగంలోకి దిగిన అధికారులు
- వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పీవో సూరజ్ గనోరే పర్యటన
- మైక్‌ల ద్వారా అప్రమత్తం
- సిద్ధం చేసిన లాంచీలు, పడవలు

చింతూరు /ఎటపాక: భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి, శబరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో విలీన ప్రాంతాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వరద తాకిడి నెలకొంటోంది. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగం కూడా అప్రమత్తమైంది.



ముంపునకు గురయ్యే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే



ముందస్తుగా గర్భిణిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న వైద్యసిబ్బంది

ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో..
రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి, శబరి నదులు మరింత పెరిగితే ముందుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను మైకుల ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. వరద సహాయక సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉంటూ వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని పీవో సూచించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఆయన వాటిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, జూలైకు సంబంధించిన రేషన్ సత్వరమే పంపిణీ చేయాలని ఆదేశించారు.

లాంచీలు, పడవలు ఏర్పాటు
వరద మరింత పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 13 లాంచీలు, మర పడవలను సిద్ధంగా. గ్రామాల్లోకి వరద ప్రవేశిస్తే ఇళ్లను ఖాళీచేయించి వాటిద్వారా ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని తరలించేందుకు కూడా లాంచీలు, పడవలను వినియోగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తుగా హైరిస్క్ గర్భిణుల తరలింపు
వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన హైరిస్క్ గర్భిణులు, డయాలసిస్ రోగులను ముందస్తుగా చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. గ్రామాలతో పాటు పునరావాస కేంద్రాల్లో పాము కాటు, కుక్కకాటు వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచినట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

ఆలయాన్ని చుట్టుముట్టిన గోదావరి
దేవీపట్నం: ఎగువప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద నీరు చేరుతుండడంతో దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద గోదావరి ముంచెత్తింది. నాలుగురోజుల క్రితం వరద పెరిగి ఆలయంలోకి చేరిన వరదనీరు తగ్గుముఖం పట్టడంతో సోమవారం పూర్తిగా తొలగిపోయింది. బుధవారం ఉదయం నుంచి వరద పరిస్థితి మరింత పెరగడంతో అమ్మవారి ఆలయాన్ని దాటుకుని కార్యాలయం వరకూ వరదనీరు పోటెత్తింది. అమ్మవారి విగ్రహం మూడొంతులు నీటమునిగింది. ఎగువప్రాంతాల నుంచి వరదనీరు మరింత ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉండడంతో ఆలయం పూర్తిగా నీటమునిగే సూచనలు కనిపిస్తున్నాయి.



విలీన మండలాల్లోని ముంపు ప్రాంతాల్లో సిద్ధం చేసిన లాంచీలు



గోదావరి వరద నీటిలో మునిగిపోతున్న గండిపోశమ్మ ఆలయం

- దండంగి పురుషోత్తపట్నం ఆర్‌అండ్‌బీ రహదారి పైకి వరదనీరు చేరడంతో పోశమ్మగండికి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ కారణంగా పోశమ్మగండి వద్ద వరద ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. అమ్మవారి ఆలయానికి భక్తులెవరూ రావొద్దని ఇప్పటికే అధికారులు వారం రోజుల క్రితం ప్రకటించారు. గోదావరి పోటు కారణంగా దండంగి వాగుకు శీతారం వరకూ వరదనీరు పోటెత్తింది.

బఫర్ స్టాక్ సత్వరమే పంపిణీ
వీఆర్‌పురం: గోదావరి, శబరి నదులకు వరద నీరు పెరుగుతున్న నేపథ్యంలో నిర్దేశిత స్టాక్ పాయింట్లకు బఫర్ స్టాక్‌ను సత్వరమే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీధర్‌ను ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. మండలంలోని గోదావరి,శబరి నదీ పరివాహక గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. జీడిగుప్ప సచివాలయం పరిధిలోని రాయిగూడెం పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చింతరేవుపల్లి, గుండుగుడెం పునరావాస కేంద్రాలతో సోములగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తాగునీటి సరఫరా తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం
ఎటపాక : గోదావరికి వరద ఉధృతి నెలకొన్న కారణంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మురుమూరు, నందిగామ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వరద వివరాలను సర్పంచ్‌ల నుంచి తెలుసుకున్నారు. వరదల సమయంలో తమకు ఇబ్బందులు కలుగకుండా టార్పాలిన్లు, క్యాండిళ్లు, బియ్యం,కూరగాయలు ముందుగానే సమకూర్చాలని ప్రజలు తహసీల్దార్‌కు విన్నవించారు.అయితే గోదావరిలో చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని తహసీల్దార్ సూచించారు.



మైక్ ద్వారా అప్రమత్తం చేస్తున్న సిబ్బంది

అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉండాలి
కూనవరం: శబరి, గోదావరి నదులకు వరదతాకిడి నెలకొంటున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. మండల పరిధిలోని కోతులగుట్ట పునరావాస కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఏపీఆర్ గురుకుల పాఠశాలను, నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కె.అనసూయ నుంచి ముంపునకు గురయ్యే గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. భద్రాచలంలో రెండవ ప్రమాద హెచ్చరిక (48 అడుగులు) జారీ అయితే కూనవరంలో ఉదయభాస్కర్ కాలనీ, గిన్నెలబజారు, శబరికొత్తగూడెం, టేకుబాక తదితర గ్రామాలను తరలించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. తొలి ప్రమాద హెచ్చరికతో టేకులబోరు, కొండ్రాజుపేట, పోలిపాక రహదారులపై వరదనీరు చేరుతుందని వివరించారు. మూడవ ప్రమాద హెచ్చరికతో(53 అడుగులు) రాగానే మండలాన్ని వరదనీరు ముంచెత్తుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతీ అధికారి, సిబ్బంది హెడ్ క్వార్టర్‌లో ఉండాలని పీవో ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.వెంకటేష్, వీఆర్‌పురం తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఒక్కరోజులో ఎంతమార్పు



మంగళవారం ఇసుక తిన్నెలతో శబరి నది

చింతూరు: శబరినదిలో మంగళవారం సాయంత్రం వరకు ఇసుక తిన్నెలు కనిపించాయి. బుధవారం ఉదయం చూసిన ప్రజలకు ఇసుకతిన్నెలు మాయమై ఉప్పొంగి ప్రవహిస్తున్న శబరినది కనిపించింది.



బుధవారం ఉప్పొంగిన శబరి నది

వాగులకు గోదావరి పోటు



ఎటపాక మండలం నందిగామ వాగుకు పోటెత్తిన గోదావరి వరద నీరు

గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండటంతో ఇప్పటికే విలీన మండలాల్లోని అధికారులు అప్రమత్తమయ్యారు. వాగుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి వరద నీరు నెల్లిపాక, తోటపల్లి, నందిగామ, మురుమూరు వాగులకు ఎగదన్నుతోంది. బుధవారం రాత్రి 9 గంటలకు భద్రాచలంలో 34.7అడుగుల వద్ద గోదావరి నీటిమట్టం ఉంది. 43 అడుగులకు చేరుకోగానే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

న్యూస్‌రీల్

నేడు మానసిక రోగులకు ఉచిత వైద్య శిబిరాలు

రాజవొమ్మంగి: మానసిక రోగుల కోసం పలు పీహెచ్‌సీల్లో ఉచి త వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు మానసిక వైద్య నిపుణుడు (డీ ఎంహెచ్‌పీ) రామారెడ్డి తెలిపారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు, ఎల్లవరం పీహెచ్‌సీలో 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్న భోజన విరామం తరువాత గంగవరం పీహెచ్‌సీలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గంగవరంలో రోగులు మధ్యాహ్నభోజనం చేసిన తరువాత రావాలని ఆయన సూచించారు. మానసిక సమస్యలు ఉన్న వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రూప్-1 మెయిన్స్‌లో గిరి విద్యార్థినుల సత్తా



చిట్టపులి జీవన



నవ్యసాయి గౌరి

పాడేరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్‌లో ముగ్గురు గిరి విద్యార్థినులు సత్తా చాటారు. చిట్టపులి జీవన, నవ్యసాయి గౌరి, వెంకట సత్య కీర్తి ఇటీవల జరిగిన మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచి ఇంటర్వ్యూకు ఎంపిక అయ్యారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 21వ సెంచరీ శిక్షణ సంస్థ ద్వారా వేపగుంట వైటీసీలో సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు తర్ఫీదు ఇచ్చారు. ముగ్గురు విద్యార్థినులను ఐటీడీఏ పీవో వి.అభిషేక్, 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి అభినందించారు.

వ్యాపారులు లేక నష్టం



డముకు వారపు సంతలో వ్యాపారుల కోసం వేచి ఉన్న గిరి రైతులు

అనంతగిరి: మండలంలోని డముకు, కాశీపట్నం వారపు సంతకు వ్యాపారులు రాకపోవడంతో గిరి రైతులు ఇబ్బందులు పడ్డారు. సంతల్లో విక్రయించేందుకు సీతాఫలం, పనస, మామిడి పండ్లను వారపు సంతలకు తీసుకువచ్చారు. వర్షాలు కారణంగా మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తక్కువ మంది మాత్రమే వచ్చారు. దీంతో గిట్టుబాటు ధర రాకపోయినా తగ్గించి విక్రయించాల్సి వచ్చిందని గిరి రైతులు వాపోయారు.

వరదలు సమర్థవంతంగా ఎదుర్కొంటాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- సీలేరు పీహెచ్‌సీ సందర్శన

సీలేరు: గోదావరి వరదలను అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి చింతూరు వెళ్తున్న ఆయన మార్గంమధ్యలో ఉన్న స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం రాత్రి 35 అడుగులకు గోదావరి వరద నీరు చేరిందన్నారు. దీంతో జిల్లాయంత్రాంగం అప్రమత్తమై అందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు చర్యలు చేపట్టాయన్నారు. బోట్ల రాకపోకలు నిలిపివేశామని, వరద బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు.ఈ నెల 23 వరకు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విలీన మండలాల్లోని ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు.

పూర్తిస్థాయిలో మందుల సరఫరా
జిల్లాలో అన్ని పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో మందులు చేరవేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. ప్రస్తుతం వరదలు, సీజనల్ వ్యాధుల కాలం కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధిగా గ్రామాలను సందర్శించాలని సూచించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ కిట్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మలేరియా కేసులు నమోదైన చోట స్ప్రేయింగ్ పనులు చేయించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సీలేరు పీహెచ్‌సీని తనిఖీ చేసి మందులను పరిశీలించారు. సీలేరు పీహెచ్‌సీకి 108 ఏర్పాటు చేయాలని, సీలేరు పరిధిలో ఉన్న రోగులను చింతూరు ఆస్పత్రికి తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సీలేరు వైద్యాధికారి సౌమ్యను ఆదేశించారు.



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం

- చింతూరు వరదలపై 15 రోజుల క్రితమే అధికారులతో సమీక్ష
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్ వెల్లడి




సాక్షి, విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉధృతంగా కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, ఏఎస్సార్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. బుధవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది జూలై 9వ తేదీన శబరినది ఉప్పొంగి చింతూరు ప్రాంతం అంతా జలమయమై.. అనేక గ్రామాలు నీట మునిగాయన్నారు. అప్పుడు వెంటనే ప్రభుత్వం స్పందించి అక్కడ ప్రజలకు పునరావాసం కల్పించిందని తెలిపారు. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని మంత్రి చెప్పారు. అల్లూరి జిల్లాకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేశామని మంత్రి పేర్కొన్నారు. వరద ఉధృతి పెరిగినా.. అల్లూరు జిల్లా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య సిబ్బందిని, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు. గత ఏడాది వరద ఉగ్రరూపం దాల్చినా, ఏ ఒక్కరికీ ప్రాణహాని లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

పొంగిన గెడ్డలు.. నిలిచిన రాకపోకలు 9లో



మద్దిగరువు- బొయితిలి మార్గంలో మట్టిరోడ్డుకు పడిన గండి

జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు వాగులు ఉప్పొంగడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు, పొలాలు నీటమునిగాయి.



క్లుప్తంగా

పార్లమెంట్ సమావేశాలకు అరకు ఎంపీ

కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పార్ల మెంట్ సమావేశాల నిమిత్తం బుధవారం విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లారు. ఆ మేరకు ఆమె కొద్ది రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండరని ఎంపీ క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

గంజాయి తరలిస్తున్న పది మంది అరెస్టు



మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన గంజాయి నిందితులు

మోతుగూడెం: మోతుగూడెం పోలీసులు బుధవారం మూడు వేర్వేరు కేసుల్లో పదిమంది గంజాయి నిందితులను అరెస్టు చేశారు. మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలో వాహనాల్లో గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు. ఈ కేసులో పదిమంది నిందితులను అరెస్టు చేసి 44 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 14 కేజీల గంజాయితో ఆరుగురు నిందితులను, 12 కేజీల గంజాయితో ముగ్గురు నిందితులను, 18 కేజీల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు. నిందితుల నుంచి రెండు కార్లతోపాటు మూడు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.లక్షా 34 వేలు ఉంటుందన్నారు. ఒడిశా ప్రాంతంలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు.

ప్యాకేజీలో మరిన్ని గ్రామాలు చేర్చాలని వినతి

కూనవరం: మండలంలో కొండ్రాజుపేట పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామంలో 52 కుటుంబాలను, చినార్కూరు పంచాయతీ జిన్నెలగూడెంలో 215 కుటుంబాలను, పెదార్కూరు పంచాయతీ బండారు గూడెంలో 63 కుటుంబాలను మొదటి ప్రయార్టీ లిస్టులో చేర్చి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పునరావాసం కల్పించాలని కోరుతూ ఎంపీపీ పాయం రంగమ్మ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ ఆధిద్య ఐఏఎస్‌కు బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

సినిమా డైలాగులు ఇక్కడ పనిచేయవు

- సినిమా మాదిరిగా నిజ జీవితంలో టేకులు ఉండవు
- వలంటీర్లపై పవన్ కల్యాణ్ విమర్శలు సరికాదు
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

కొయ్యూరు: సినిమాలో మాదిరిగా నిజ జీవితంలో టేకులు ఉండవని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేశారు. పవన్ సినిమా డైలాగులు ఇక్కడ చెబితే పని చేయవన్నారు. కొమ్మికలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తూ నిత్యం పోరాటాలు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. నాయకత్వ లక్షణాలున్న వారు ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. అలా చేసింది సీఎం జగనన్న ఒక్కరేనని స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మహా సంకల్ప యాత్ర మూలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నవరత్న పథకాలను ప్రవేశపెట్టి అందజేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని గుర్తు చేశారు. అలాంటి మోసం చేసే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు ప్రకటిస్తున్న అమలు చేయని, సాధ్యం కాని హామీలను ప్రజలు గమనిస్తున్నారని, మరోసారి గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలువురు లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి పరామర్శ

నల్లగొండలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన కోనేటి అచ్చియమ్మ ఇంటిని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరిశీలించారు. బాధితురాలికి న్యాయం చేస్తామని తెలిపారు. తక్షణ సాయంగా రూ.23 వేలు కలెక్టర్ ద్వారా ఆమెకు అందజేశారు. బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేశారు. ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల జోలికొస్తే పవన్‌కు పుట్టగతులుండవు: అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: రాష్ట్రంలో గ్రామ వలంటీర్ల జోలికి వస్తే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు పుట్టగతులుండవని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. అరకులోయలోని క్యాంపు కార్యలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పిన తర్వాతే జనసేన నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి తిరగాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన ద్వార ప్రజల నుంచి ఆదరణను చూసి ఓర్వలేక జనసేన అధ్యక్షుడు, ఆ పార్టీ నాయకులు ఓర్వలేక లేనిపోని నిందలు వేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లు దురియా భాస్కర్‌రావు, రాధిక, మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర గాసి, ఎంపీటీసీ భీమరాజు, హుకుంపేట మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, మాజీ సర్పంచ్ గొల్లోరి గోపాల్, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకటరావు, నాయకులు సోమేశ్వరరావు, బలరాం, మల్లేశ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం



ఇందుకూరుపేటలో పోలవరం నిర్వాసితులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన గ్రామాల్లో అర్హతగలిగిన ప్రతి నిర్వాసితుడికీ పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. ఇందుకూరుపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలవరం నిర్వాసితులకు ఇళ్లపట్టాలు అందజేశారు. పూడిపల్లి గ్రామానికి చెందిన గిరిజనేతరులకు గోకవరం మండలంలో పునరావాస కాలనీ నిర్మిస్తున్నారు. ఈ కాలనీకి చెందిన నిర్వాసితులు 224 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన దండంగి, గంపాలెం , కొండమొదలు, మడిపల్లి, మంటూరు తదితర గ్రామాలకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు త్వరలోనే ఇళ్లపట్టాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ప్రయోజనాలు పూర్తిగా గాలికొదిలేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి అందించడంతో పాటు పునరావాస కాలనీలు నిర్మించి తరలించినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి రూ.10లక్షల వరకూ అందిస్తామన్నారు. దీనికి సంబంధించిన జీఓ కూడా జారీ అయ్యిందన్నారు. త్వరలోనే మిగిలిన సొమ్ములు నిర్వాసితుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కొన్ని గ్రామాల్లో ముంపునకు గురైన భూములకు తక్కువ నష్ట పరిహారం పొందిన భూములకు ఎకరాకు రూ.5లక్షల వరకూ అందించనున్నట్లు తెలిపారు. నిర్వాసితుల సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని అర్హులందరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, ఎంపీడీఓ కె.రత్నకుమారి, నాయకులు బాబ్జి, సత్యనారాయణ, మురళీకృష్ణ, పెద్దబ్బాయిదొర, లక్ష్మణ్, శ్రీనివాస్‌దొర, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి: లంకపాకలు ఘాట్‌రోడ్డులో బుధవారం గాలివానకు రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం కూలింది. దీంతో సుమారు మూడు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్టును తొలగించడంతో వాహనాల రాకపోకలు యధావిధిగా సాగాయి.

వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు సరికాదు



ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లి: దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న వలంటరీ వ్యవస్థపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణ వేయడాన్ని ప్రజలు సహించరని ఎంపీపీ కోరాబు అనూషా దేవి హెచ్చరించారు. ఆమె బుధవారం విలేకరుతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే సేవలందుతుంటే ఓర్వలేక టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ బుద్ధిలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఆయా ప్రతిపక్షాలకు సరైన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్రశాంత వాతావరణంతోనే గ్రామాల అభివృద్ధి

- ఎస్పీ తుహిన్ సిన్హా
- చింతపల్లిలో పోలీసు బ్యారెక్స్‌ల ప్రారంభం



సీలేరు పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

చింతపల్లి: మన్యంలోని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. మండల కేంద్రం చింతపల్లిలో పోలీసు బ్యారెక్స్‌లను బుధవారం ఎస్పీ తుహన్ సిన్హా, అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ప్రారంభించారు. ఇటీవల వీటిని రూ.25 లక్షలతో నిర్మించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నివాసం ఉండేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకే వీటిని నిర్మించామని ఎస్పీ పేర్కొన్నారు. అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల గిరిజనుల పంటలు నేరుగా ఆటోలు, వ్యాన్లలో కావలసిన చోటకు తరలించి నచ్చిన ధరలకు విక్రయించు కుంటున్నారన్నారు. గ్రామాల్లో సెల్‌ఫోన్ వ్యవస్థ మెరుగుపడిందన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థులు సంఘ వ్యతిరేక శక్తులకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని ఎస్పీ కోరారు. ప్రయాణికుల ముసుగులో ఆటో డ్రైవర్లు గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

సీలేరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శన

సీలేరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తుహిన్‌సిన్హా బుధవారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి, అనంతరం సీఆర్పీఎఫ్ సెంట్రిపోస్టులను పరిశీలించారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, గంజాయి నియంత్రణకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్‌శివకిశోర్ ఉన్నారు.

సరిహద్దుల్లో నిరంతరం అప్రమత్తత

- కోరాపుట్టు డీఐజీ చరణ్‌సింగ్ మీనా
- ఏవోబీలో పోలీసు అవుట్ పోస్టు నూతన భవనం ప్రారంభం

ముంచంగిపుట్టు: ఏవోబీ సరిహద్దు ప్రాంతంలో పోలీసు బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరాపుట్టు డీఐజీ చరణ్ సింగ్ మీనా ఆదేశించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టులో బుధవారం పోలీసు అవుట్ పోస్టుకు రూ.3కోట్లతో నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక అవుట్ పోస్ట్ పోలీసులతో సమావేశం అయ్యారు. సరిహద్దుల్లో ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు. అవుట్ పోస్ట్ ఏర్పాటు వల్ల కలిగిన ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏవోబీలో అవుట్ పోస్టుల ఏర్పాటు వల్ల సరిహద్దు గిరిజనులకు స్వచ్ఛత లభించడమే కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవితం గడుపుతున్నారన్నారు. ,ప్రభుత్వాలు ద్వారా వచ్చే అన్ని రకాల సంక్షేమ పథకాలు పొందుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. డీఐజీ పర్యటన నేపథ్యంలో సరిహద్దుల్లో పోలీసు బలగాలు పహరా కాశాయి.కోరాపుట్టు ఎస్పీ అభినవ శంకర్, ఎస్‌డీపీవో సంజయ్ మహాపాత్రో పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సచివాలయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతోనే సాధ్యమైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ముందుగా ఏర్పాటు చెసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో సాధ్యపడుతుందన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో ఈ వ్యవస్థ అభివృద్ధి బాట పట్టిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో గిరిజనుల సమస్యలు తీరాయని, ఇంటివద్దకే పాలన జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అన్ని రకాల సమస్యలకు సచివాలయ వ్యవస్థతోనే సాధ్య పడిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, పంచాయతీరాజ్ డీఈ ఆర్.రామన్, ఏఈఈ ఎస్.సంజీవరావు, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండలరావు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్‌లు కాకరి బొంజుబాబు, సమిడ వెంకట పూర్ణిమ, తాంగుల మోహన్‌దాస్, ఎంపీటీసీ సభ్యులు గంజాయి సుశీల, సొంబే బాలకృష్ణ, సర్పంచ్ లక్ష్మయ్య, నాయకులు భూషణ్, మహేష్, వెంకట్, శివాజీ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■ 2acr Land 500 mts from beach at pudimadaka near Atchutapuram suitable for beach resorts also investors. @4cr. Ph : 97045 64060, 90006 42047 [V- 10833]

Services

BUSINESS OFFER
■ S.Foundationకంపెనీకిప్రాతినిధ్యంవహించడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కనీస అర్హతను కల్గి మంచి నైపుణ్యం కల్గిన ఏజెంట్స్ కావలెను. జీతం+Incentives ఇవ్వబడును.9045058168. [T-1191473]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]

SEPTIC TANK CLEAN
■ శ్యామ్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతి తక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్: 90149 03518, 98488 06516 [V-2025]

Wanted
■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9346276788. [M-1221462]

■ విశాఖపట్నంలో అనుభవజ్ఞులైన మరియు ఫ్రెషర్స్ కోసం పెస్ట్ కంట్రోల్, టెక్నీషియన్ ఉద్యోగాలు పూర్తి శిక్షణ అందించబడుతుంది. అర్హత : 10th (P/F), జీతం : 12,000/-, బైక్ తప్పనిసరి. ఫోన్: 86390 16987 [V-794673]

■ Job Opportunity : లీగాలిటి ఉన్న లే అవుట్స్ కొత్తవలస / విజయనగరం / భోగాపురం / ఆనందపురంలో రెడీ టు కన్‌స్ట్రక్షన్ Plots కలవు. ఫుల్ / పార్ట్ టైమ్‌గా పనిచేయుటకు రిటైర్డ్ / VRS & గృహిణులు కావలెను. 2-5 లక్షలు సంపాదించుకొనే అవకాశం. వయస్సు : 30 సం॥ & ఆపైన. ఫోన్: 73308 11149 [V- 2769]

■ 1) దువ్వాడలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూం ఫ్రీ. 2) హిందీ మాట్లాడం వచ్చి, అనుభవం గల ఇండియన్ చెఫ్, కుక్స్, హౌస్ కీపింగ్, డ్రైవర్లు కావలెను. ఫుడ్ + వసతి ఫ్రీ. గుడ్ శాలరీ. ఫోన్: 91001 03011, 93099 87957 [V-2026]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [HA-424]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి
www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

సహకార రంగం బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

పాడేరు రూరల్: రైతుల వ్యవసాయ పరపతి అందించడమే లక్ష్యమని జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. పాడేరు జిల్లా కేంద్రంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన వన, మత్స్య, పశు సంవర్ధక శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సచివాలయం సిబ్బందితో నిర్వహించిన ఒక రోజు వర్కుషాపునకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సొసైటీలలో అనుబంధంగా ఉన్న రైతులను సంప్రదించి వ్యవసాయ పెట్టుబడుల వినియోగాన్ని తెలుసుకోవాలన్నారు. గిరిజన రైతులను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని సూచించారు.రైతులకు పంట నష్టం లేకుండా సొసైటీల ద్వారా పంట కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. సొసైటీలకు పెట్రోల్ బంకు ఏర్పాటు, రేషన్ డిపోలు నిర్వహణకు అనుమతులు ఇస్తామన్నారు. జిల్లా సహకార అధికారి ఎం.వి.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్ రావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పిఆర్.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సహాయక చర్యలు

ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి



మాట్లాడుతన్న ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి

చింతూరు: అధికారులు, దిగువస్థాయి సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్ధవంతంగా వరద సహాయక చర్యలు చేపట్టాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వరద ముందస్తు జాగ్రత్తలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రహదారి సౌకర్యం నిలిచిపోయిన చదలవాడ, గవళ్లకోట, చౌలూరు, మిట్టవాడ, ఏరువాడ గ్రామాలకు నిత్యావసర సరకులు అందచేయాలని, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. సమీక్షా సమావేశాలకు రాకుండా కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎంపీపీ సవలం అమల మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



జీసీసీ ఇండియన్ గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్లను తనిఖీ చేస్తున్న జీసీసీ డీఎం సింహాచలం

జి.మాడుగుల: పాడేరు ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి వినియోగదార్లు గ్యాస్ సిలిండర్లు విడిపించుకుంటే అదనపు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు భరించాల్సి వస్తుందని, జి.మాడుగుల జీసీసీ గ్యాస్ గోడౌన్ నుంచి అయితే ట్రాన్స్‌పోర్టు చార్జీలు మిగుతాయని పాడేరు జీసీసీ డీఎం డి.సింహాచలం తెలిపారు. స్థానిక జీసీసీ ఆధ్వర్యంలో ఇండియన్ గ్యాస్ గోడౌన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జి.మాడుగుల జీసీసీ అధ్వర్యంలో నడుస్తున్న ఇండియన్ గ్యాస్ గోడౌన్ పరిధిలో 193 కనెక్షన్లు మాత్రమే ఉన్నాయన్నారు. మండలంలో వివిధ ప్రాంతాలకు సంబంధించి గ్యాస్ కనెక్షన్లు సుమారు 13, 000గ్యాస్ కనెక్షన్లు పాడేరు ఐటీడీఏ ఇండియన్(ఐవోసీ)గ్యాస్ పరిధిలో ఉన్నాయన్నారు. గిరిజన వినియోగదారులు అనుకూలంగా ఉంటుందని, రవాణా ఛార్జీలు తగ్గుతాయని ఉద్దేశ్యంతో జి.మాడుగులలో గ్యాస్ గోడౌన్‌ను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే జీసీసీ లక్ష్యమన్నారు. గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేసి మూడేళ్ల అయినప్పటికీ జీసీసీ అధ్వర్యంలో కొనసాగుతున్న గ్యాస్ ఏజెన్సీకి ఆదాయం లేదని చెప్పారు. పాడేరు నుంచి గ్యాస్ సరఫరా వలన గిరిజన వినియోగదారులకు అదనంగా రూ.200 చార్జీల భారం పడుతుందని, దీన్ని తగ్గించాలంటే జి.మాడుగుల జీసీసీ గ్యాస్ గోడౌన్‌కు ఆయా కనెక్షన్లు బదిలీ చేయాల్సి ఉందన్నారు. దీని వల్ల మరికొంతమంది గిరిజన యువకులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు.పాడేరు ఐటీడీఏ ఇండియన్ గ్యాస్ పరిధిలో ఉన్న జి.మాడుగుల మండలానికి సంబంధించిన 13వేలు గ్యాస్ కనెక్షన్లు స్థానిక జీసీసీ పరిధిలో ఉన్న ఇండియన్ గ్యాస్‌కు బదిలీ చేయాలని కోరుతూ కలెక్టర్, ఐటిడిఏ పీవోకు నివేదించనున్నట్టు డీఎం సింహాచలం తెలిపారు. జీపీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్, కొండబాబు, గ్యాస్ గోడౌన్ సూపరింటెండ్ ఎం .రామచంద్రరాజు తదితరలున్నారు.

మీనామృతంతో అధిక దిగుబడులు



మీనామృతం తయారీని వివరిస్తున్న రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి

జి.మాడుగుల: గిరిజన రైతులు చేపల వ్యర్థాలతో తయారీ చేసిన మీనామృతం వినియోగించడంతో పంటల దిగుబడి, పంట ఆరోగ్యంగా ఉంటుందని రైతు సాధికార సంస్థ జి.మాడుగుల యూనిట్ ఇన్‌చార్జి ఐ.మహేశ్వరి తెలిపారు.మండలంలో సొలభం పంచాయతీ రచ్చపల్లి, పెద్దలంక గ్రామంలో బుధవారం చేపల వ్యర్థాలతో మీనామృతం తయారీ విధానంపై ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చేపల వ్యర్థాలతో తయారీ చేసిన మీనామృతాన్ని 27రోజులు నిల్వ ఉంచి, 200లీటర్లు నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయటం వలన మొక్కకు మంచి ఎదుగుదల, బలం వస్తుందన్నారు. పీఎండీఎస్లో 20–25రకాలు పంటలు వలన వేసుకోవటం వలన తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందవచ్చని సూచించారు. వరిలో శ్రీవరి, లైన్ షోయింగ్, కాలిబాటలు తీయడం వలన గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా తగిలి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఐసీఆర్‌పీఎస్‌లు లక్ష్మయ్య, ఎర్రయ్యదొర, జాషువా, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి



లక్ష్మీనారాయణ మృతదేహం

యలమంచిలి: వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు అతని ప్రాణం తీసింది. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి హైవే వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామానికి చెందిన బొక్కా లక్ష్మీనారాయణ (28) దుర్మరణం చెందాడు. యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి రొయ్యల లోడుతో బయలుదేరిన వ్యాన్ విశాఖపట్నం జిల్లా గాజువాకకు వెళుతుండగా ... యలమంచిలి 16వ నంబరు జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



రాజుమృతదేహం

నక్కపల్లి: జాతీయరహదారిపై గొడిచర్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. వేంపాడుకు చెందిన క్లోపల్లి వెంకటసుబ్రహ్మణ్యం రాజు(51) తుని ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి డిపోనుంచి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా గొడిచర్ల వద్ద వాహనం అదుపుతప్పి కిందపడడంతో రాజుతలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నక్కపల్లి పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో మరో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్: గంజాయి రవాణా కేసులో మరో వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఊడేరు కూడలి మీదుగా మంగళవారం నలుగురు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో ఒకరిని అరెస్టు చేయగా, మిగతా ముగ్గురు పరారయ్యారు. పరారైన వారిలో ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

బుచ్చెయ్యపేట: గొర్లెపాలెంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. రూ.15,082 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.